క్లుప్తంగా

1న తుగ్గలిలో భజన పోటీలు

తుగ్గలి : హనుమజ్జయంతిని పురస్కరించుకుని జూన్1వ తేదీన రాత్రి తుగ్గలి సమీపంలోని కిష్టాపురం ఆంజనేయస్వామి ఆలయంలో భజన పోటీలు ఏర్పాటు చేసినట్లు కార్యనిర్వాహకులు శ్రీనివాసులు, పూజారి ప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోటీల్లో గెలుపొందిన భజన బృందాలకు వరుసగా రూ.10వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.4వేలు, రూ.2వేలు, రూ.వెయ్యి అందజేయనున్నట్లు వెల్లడించారు. వివరాలకు సెల్ 9666108793, 9032694726 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

దోమల వృద్ధిని అరికట్టండి



దోమల నివారణపై సూచనలిస్తున్న మలేరియా అధికారి మంజునాథ్

ఆలూరు: దోమలు వృద్ధి చెందకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదోని డివిజన్ మలేరియా అధికారి ఎస్.మంజునాథ్ ప్రజలకు సూచనలు చేశారు. ఎల్లార్తి రోడ్డు సమీపంలో నివాసముంటున్న చాకలి చంద్రశేఖర్ కుమారుడు చాకలి కౌశిక్ అనే ఐదేళ్ల బాలుడికి డెంగీ నిర్ధారణ కావడంతో బుధవారం ఆ ఇంటిని సందర్శించారు. అనంతరం దోమలు వృద్ధి చెందకుండా వీధిలో గ్రామ పంచాయతీ సిబ్బంది చేత మందును పిచికారీ చేయించి బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించారు. అనంతరం కోయినగర్, మర్రితాతమఠం కాలనీవాసులకు దోమల నివారణపై అవగాహన కల్పించారు. మొలగవెల్లి పీహెచ్ ఎంపీఈఓ ఆంద్రూస్, సచివాలయ సిబ్బంది ఉమామహేశ్వరి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు ఉన్నారు.

కుక్కల దాడిలో 8 గొర్రెలు మృతి



ఆస్పరిలో మృతి చెందిన గొర్రెలు

ఆస్పరి: మండల కేంద్రమైన ఆస్పరిలో మంగళవారం రాత్రి బెల్లం నాగలింగన్నకు చెందిన 8 గొర్రెలపై కుక్కలు దాడి చేసి చంపేశాయి. నాగలింగన్న ఇంటి పక్కనే ఉన్న కాంపౌండ్‌లో 15 గొర్రెలను విడిచాడు. మంగళవారం రాత్రి కాంపౌండ్‌లోకి వెళ్లిన కుక్కలు గొర్రెలపై దాడి చేసి చంపివేశాయి. దీంతో తనకు రూ.1.50 లక్షలు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలని నాగలింగన్న అధికారులను కోరుతున్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

చిప్పగిరి: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ జూటూరు హేమలత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బరెన్ సాహెబ్ తెలిపారు. సమావేశం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని చెప్పారు. సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలన్నారు. అలాగే అన్ని శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని ఆదేశించారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు



శభాష్‌పురంలో శాంతిభద్రతలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

తుగ్గలి : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా రాజకీయ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు సంయమనం పాటించాలని, అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పత్తికొండ టౌన్, రూరల్ సీఐలు మురళీమోహన్, ప్రవీణ్ కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం శభాష్‌పురంలో జొన్నగిరి, తుగ్గలి, పత్తికొండ, మద్దికెర ఎస్ఐలు రామాంజనేయులు, మల్లికార్జున, గోపాల్, రమేష్, పోలీసు సిబ్బందితో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో అనుమానితుల ఇళ్లలో సోదాలు చేశారు. ప్రజలను సమావేశ పరిచి శాంతిభద్రతలపై అవగాహన కల్పించారు. ఎవరైనా గొడవలు పడినా, సోషల్ మీడియాలో వదంతులు వ్యాప్తి చేసినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

గుండె పోటుతో డీలర్ మృతి

తుగ్గలి : స్థానిక 41వ చౌకదుకాణం డీలర్ మహమ్మద్ (75)గుండె పోటుతో మృతి చెందారు. వారం క్రితం కాలు విరగడంతో కర్నూలులో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నారు. ఆరోగ్యం కుదుట పడుతుందనగా బుధవారం గుండెపోటుకు గురై మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు భార్యలు, నలుగురు కుమారులు, 9మంది కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతి పట్ల చౌక దుకాణ డీలర్ల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు రామచంద్రారెడ్డి, సుంకయ్య, పలువురు డీలర్లు సంతాపం తెలిపారు.

అన్నదాతకు వెన్నుదన్నుగా..

- ఆర్బీకేల్లో రైతులకు సమాచార కేంద్రంగా కియోస్క్
- ఎరువులు, మందులు బుక్ చేసుకునే అవకాశం
- వాతావరణం నుంచి పంటల విక్రయం వరకు సమస్త వివరాలు అందుబాటులో
- తొమ్మిది రకాల సేవలందిస్తున్న యంత్రం
- రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ప్రభుత్వం



ఎరుకలచెర్వు ఆర్బీకేలో కియోస్క్‌లోనున్న యాప్‌ల వినియోగాన్ని రైతులకు వివరిస్తున్న వ్యవసాయ సిబ్బంది

కృష్ణగిరి: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్నదాతను చేయిపట్టకొని నడిపించి వ్యవసాయాన్ని పండుగలా మార్చింది. అడుగడుగునా అండగా నిలిచి రైతు ప్రభుత్వంగా పేరుగాంచింది. గ్రామ స్థాయిలోనే రైతన్నకు సేవలన్నీ అందించాలని వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. భూసార పరీక్షల నుంచి పంట దిగుబడి విక్రయం వరకు అన్ని రకాల సేవలను వీటిల్లో అందుబాటులో ఉంచింది. గతంలో రైతులు విత్తనాలు, ఎరువులు పొందాలంటే ఎలాంటి పరిస్థితులను ఎదుర్కొన్నారో గమనించి వాటి నుంచి విముక్తి కల్పించేలా చర్యలు చేపట్టింది. ఏ సీజన్‌కు అవసరమైన ఎరువులు, మందులు గ్రామంలో అందుబాటులో ఉంచి నిర్దేశించిన ధరకు విక్రయించడంతో కర్షకులకు కష్టాలు తప్పాయి. ఇక రైతన్నలు ఎరువులు, మందులు అవసరమైన వాటిని సొంతంగా బుక్ చేసుకునేందుకు కియోస్క్ యంత్రాలను ఏర్పాటు చేసింది. వీటిల్లో తొమ్మిది రకాల సేవలందేలా చర్యలు తీసుకుంది. దీని ద్వారా ఏ కాలంలో ఏ పంటలు వేయాలి, కొనుగోలు కేంద్రాలు, పంట నాణ్యతా ప్రమాణాలు, వాతావరణం, మార్కెట్ ధరలు, మార్కెట్ కనీస మద్దతు ధరలు తదితర తొమ్మిది అంశాలను ఆయా యాప్‌ల ద్వారా రైతులు తెలుసుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు వివరించారు.

● రైతు సమాచారం..

రైతులకు సంబంధించి వ్యవసాయ వార్తలను కియోస్క్ ద్వారా తెలుసుకోవచ్చు. వైఎస్సార్ రైతు భరోసా, సాగుకు భరోసా, ప్రకృతి వ్యవసాయం సాగుచేసే విధానం, మూగ జీవాలకు అంబులెన్స్, ఆర్బీకేల పంటల కొనుగోలు వంటి వార్త సంబంధిత విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు.

● కనీస మద్దతు ధరలు..

ఆర్బీకే పరిధిలో ముఖ్య పంటలకు కనీస మద్దతు ధకలు తెలుసుకునే వీలుంది. వరి, మొక్కజొన్న, వేరుశనగ, వాణిజ్య పంటలు తదితర అంశాల్లో రైతు నష్టపోకుండా అనుకూలమైన ధరలకు అమ్ముకునేందుకు ఈ యాప్‌ను రూపొందించారు.

● ప్రయోగశాలల సమాచారం..

ఆర్బీకే పరిధిలోని రైతులకు డాక్టర్ వైఎస్సార్ సమీకృత వ్యవసాయ ప్రయోగశాలల సమాచారం అందుబాటులో ఉంచారు. దీని ద్వారా ఏ భూమిలో ఏ పంట వేయాలి, దానికి సంబంధించిన విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు, పశువులకు వచ్చిన రోగాలకు సంబంధించి అన్ని ప్రయోగాలు తెలుసుకునేందుకు వీలుంది.

● కొనుగోలు కేంద్రాలు..

గతంలో రైతులు పండించిన పంటలకు కొనుగోలు కేంద్రాలు ఎక్కడో తెలియక దళారులను ఆశ్రయించే వారు. కానీ ఇప్పుడా పరిస్థితి లేకుండా ఆర్బీకేల్లో ఏర్పాటు చేసిన కియోస్క్ ద్వారా దగ్గరలోని కొనుగోలు కేంద్రాలు.. తదితర విలువైన సమాచారం అందుతోంది. దీంతో రైతులకు చాలా లాభాదాయకంగా ఉంటుంది.

● వాతావరణం..

ఈ యంత్రం ద్వారా వాతావరణంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకునే వీలుంది. ఆర్బీకే పరిధిలో కనిష్ట, గరిష్ట ఉష్ణోగ్రతలు, వర్షపాతం వివరాలు తెలియజేస్తుంది. దీనికి అనుగుణంగా రైతులు ఏ విధమైన చర్యలు చేపట్టవచ్చో సులభంగా తెలుసుకోవచ్చు.

● మార్కెట్ ధరలు..

మార్కెట్‌లో ప్రస్తుతం ఉన్న ధరలను తెలుసుకోలేక ఒక్కొక్కరు ఒక్కోలా చెబుతుండటంతో దళారులను ఆశ్రయించాల్సి వచ్చేది. అయితే ఇప్పుడు ఆ విధానానికి స్వస్తి పలికి ఆర్బీకేకు దగ్గర్లోని వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో పంటల తేమ శాతం ఆధారంగా రైతు విక్రయించుకునే సమయానికి కినిష్ట, గరిష్ట మార్కెట్ ధరలను తెలుసుకోనేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

● ట్యుటోరియల్..

కియోస్క్‌లో పొందుపరిచిన ఆఖరి యాప్‌లో అన్ని రకాల పంటలను సాగుచేసే విధానానికి సంబంధించిన వీడియోలు ప్రదర్శించడం, సమగ్ర సస్యరక్షణ, పంట యాజమాన్యం తదితరాలను వీడియో రూపంలో చూపించి రైతులకు అవగాహన కల్పిస్తుంది.

● అనుబంధిత యాప్..

కియోస్క్‌లో పొందుపర్చిన అనుబంధిత యాప్‌లో మరో ఐదు అంశాలను చేర్చారు. ఆర్బీకే అమ్మకాలు, ఎరువులు, పురుగు మందుల విక్రయాలు తెలుసుకోవచ్చు. ప్రభుత్వం అమలు చేస్తున్న పనిముట్లు, పశుసంవర్ధక, మత్స్య సంపద ఉత్పత్తులు, సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందుల వివరాలు, కస్టమ్ హైరింగ్ కేంద్రాలు, ఇతర ప్రయోజన సౌకర్యాలు తెలుసుకునే వీలుంది.

> **రైతులకు చాలా ఉపయోగం**
>
> ఆర్బీకేల్లో ఏర్పాటు చేసిన కియోస్క్‌ల ద్వారా రైతులకు ఎంతో ప్రయోజనం చేకూర్చే యాప్‌లను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యాప్ ద్వారా తొమ్మిది రకాల ప్రయోజనాలు చేకూరుతున్నాయి. వీటిని సద్వినియోగం చేసుకుని రైతులు ఆర్థికాభివృద్ధి చెందవచ్చు. గ్రామస్థాయిలోనే అన్ని రకాలు సేవలు లభించడం వల్ల రైతులు కూడా ఆనందంగా ఉన్నారు.
>
> – ఎస్. వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయ అధికారి, కృష్ణగిరి



కియోస్క్‌లో పొందుపరిచిన మల్టీ ఫంక్షనల్ యాప్‌లు

మధ్యాహ్న భోజనం రుచికరంగా వండాలి



వంట నిర్వాహకులకు శిక్షణ ఇస్తున్న ఎంఈఓ బాలనాయుడు

చిప్పగిరి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం రుచికరంగా వండాలని ఎంఈఓ బాలనాయుడు వంట నిర్వాహకులకు సూచించారు. బుధవారం స్థానిక ఎంఆర్‌సీ భవన్‌లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన వంట నిర్వాహకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వంటలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఉన్న పదార్థాలతో రుచికరంగా ఏ విధంగా వండాలి తదితర అంశాలను వివరించారు.

త్వరలో రబీ రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ

తుగ్గలి : 2023 రబీ సీజన్‌లో వర్షాభావ పరిస్థితుల కారణంగా సాగు చేసిన పంటలు చేతికందక రైతులు తీవ్రంగా నష్టపోయారు. దీంతో ప్రభుత్వం కరువు మండలంగా చేర్చిన నేపథ్యంలో ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరైంది. మండలంలో 2,376 హెక్టార్లలో పప్పుశనగ, జొన్నతో పాటు మరో 12 రకాల పంటలు సాగు చేసి రైతులు నష్టపోయినట్లు వ్యవసాయశాఖ అధికారులు నివేదిక పంపారు. 2,087 మంది రైతులకు రూ.2.6 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ రైతుల ఖాతాలో జమకానుంది. ఆయా రైతు భరోసా కేంద్రాల్లో బుధవారం రైతుల జాబితాను ప్రదర్శనకు ఉంచినట్లు వ్యవసాయశాఖ మండల అధికారి పవన్‌కుమార్ తెలిపారు. జాబితాలో పేర్లు సరిచూసుకొని ఏవైనా పొరపాట్లు ఉంటే రెండు రోజుల్లో సరిచేసుకోవాలని రైతులకు సూచించారు. త్వరలో రైతుల ఖాతాలకు సొమ్ము జమకానుందని ఏఓ చెప్పారు.

మరింత రుచికరంగా 'జగనన్న గోరుముద్ద'



వెల్దుర్తిలో మాట్లాడుతున్న ఎంఈఓ-2 రమేశ్

వెల్దుర్తి(కృష్ణగిరి): ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న జగనన్న గోరుముద్ద మరింత రుచికరంగా ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎంఈఓలు ఇందిర, రమేశ్ తెలిపారు. పథకంలో భాగంగా ప్రతిరోజూ ఇస్తున్న మెనూ మరింత రుచికరంగా ఉండేలా తిరుపతిలోని 'తాజ్ గ్రూప్ హోటల్ వారితో ఈ ప్రక్రియ చేపట్టిందన్నారు. తాజ్ గ్రూప్ హోటల్ వారితో విజయవాడలో జిల్లాకు ఒకరి చొప్పున మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ ఇచ్చారన్నారు. అక్కడ శిక్షణ పొందిన వారు మండలాల వారీగా శిక్షణ ఇస్తున్నారని చెప్పారు. శిక్షణ పొందిన కర్నూలు మండలానికి చెందిన మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు వెంకటేశ్వరమ్మ బుధవారం వెల్దుర్తి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన నిర్వాహకులకు జగనన్న గోరుమద్ద పథకంలోని వంటలు మరింత రుచికరంగా ఎలా వండాలో శిక్షణ ఇచ్చారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలో జరిగిన శిక్షణలో భాగంగా ప్రయోగాత్మకంగా వెల్దుర్తి బాలుర హైస్కూల్, ఎంపీపీ స్కూల్ నిర్వాహకులు వండిన వంటలపై సంతృప్తి వ్యక్తం చేశారు.

కరువు సహాయక చర్యలు చేపట్టండి

దేవనకొండ: గత ఖరీఫ్, రబీ సీజన్‌లో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా తీవ్ర కరువు నెలకొని రైతులు తీవ్రంగా నష్టపోయారని, వెంటనే కరువు సహాయక చర్యలు చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వీరశేఖర్, సీఐటీయూ మండల కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.20 వేల దాకా రైతులు పంట పెట్టుబడులు పెట్టి నష్టపోయారన్నారు. ప్రతిరైతుకు ఎకరాకు రూ.20 వేల దాకా నష్టపరిహారం అందించాలని కోరారు. అలాగే వంద శాతం సబ్సిడీతో ఎరువులు, విత్తనాలను అందించాలన్నారు. అలాగే ఉపాధి కూలీలకు 200 పనిదినాలను కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, రాముడు, నాగన్న, వీరంజి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం



ఆలయానికి రూ.30 వేలు నగదును అందజేస్తున్న విరూపాక్షి

హాలహర్వి: మండలంలోని చింతకుంట గ్రామంలో వెలిసిన కంచమ్మదేవి, మదగమ్మదేవి దేవర కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విరూపాక్షి పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పునర్నిర్మాణానికి రూ.30 వేలు విరాళంగా అందించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు పాడి పంటలతో సంతోషంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించడం జరిగిందన్నారు. అలాగే రాష్ట్ర సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జూన్ 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్‌లో అత్యధిక మెజార్టీ సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్నారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రామిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జనార్దన్ నాయుడు, ఎంపీపీ నెట్టికంటమ్మ, చింతకుంట సర్పంచ్ సద్దాం, నిట్రవట్టి ఎంపీటీసీ గోపాల్, మాజీ ఎంపీపీ బసప్ప, మండల యూత్ అధ్యక్షుడు గంగాధర, సొసైటీ చైర్మన్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీరు సరఫరా



ఎల్లార్తిలో కుళాయిలకు సరఫరా అయిన నీరు

హొళగుంద: సమ్మతగేరి వద్ద ఉన్న మంచి నీటి పథకం నుంచి గ్రామాలకు కలుషిత నీరు సరఫరా అవుతున్నాయి. ఈ పథకం నుంచి సమ్మతగేరి, కోగిలతోట, పెద్దహ్యాట, చిన్నహ్యాట, బీజీ హళ్లి, ఎల్లార్తి గ్రామాలకు మంచినీరు సరఫరా అవుతున్నాయి. ఫిల్టర్‌బెడ్ సక్రమంగా పని చేయకపోయినా అందులో నుంచి నీటిని అలాగే గ్రామాలకు వదులుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. చాలా రోజుల పాటు నిల్వ ఉన్న నీరును శుద్ధి చేయకుండా అలాగే వదలుతుండడంతో ప్రజలు అనారోగ్య పాలవుతున్నామని వాపోతున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మరమ్మతుకు నోచుకోని డిస్ట్రిబ్యూటరీ కాలువలు



హొళగుంద వద్ద కాలువ దుస్థితి

హొళగుంద: తుంగభద్ర దిగువ కాలువ 3, 4 సబ్ డివిజన్ పరిధిలో డిస్ట్రిబ్యూటరీ కాలువల్లో పూడిక పెరిగి, కంట్రోల్ పాయింట్లు ధ్వంసం అయ్యాయి. పిల్ల కాలువలు ముళ్ల కంపలతో నిండి అధ్వానంగా తయారయ్యాయి. అదేవిధంగా పలు చోట్ల డీపీల కాలువ గట్లు పూర్తిగా ధ్వంసం కావడంతో కాలువ ఆనవాళ్లే లేవు. దీంతో చివరి ఆయకట్టు భూములకు సాగు నీరందక బీడు పెట్టుకుంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక వైపు నానాయకట్టు రైతుల జల చౌర్యం, మరో వైపు కాలువలు అధ్వానంగా మారి ఏళ్ల తరబడి భూములు సాగు నీరుకు నోచుకోవడం లేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి డిస్ట్రిబ్యూటరీ కాలువలకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఆస్పరి: మండలంలోని అట్టికల్లు గ్రామ సమీపంలో బుధవారం ఓ స్కూటర్‌ను కారు ఢీకొనడంతో వ్యక్తి గాయపడినట్లు ఆస్పరి సీఐ హనుమంతప్ప తెలిపారు. పత్తికొండ మండలం జూటూరు గ్రామానికి చెందిన సురేష్ అట్టికల్లు కొండల్లో రాయి కొట్టేందుకు కూలీకి వచ్చాడు. పని ముగించుకున్న సురేష్ స్కూటర్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా బిల్లేకల్లు నుంచి ఆస్పరి వైపు వస్తున్న కారు ఢీకొంది. దీంతో అతని కాలికి బలమైన గాయమైంది. గాయపడిన సురేష్‌ను చికిత్స నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు.


కూలీలందరికీ 'ఉపాధి' కల్పించాలి

కృష్ణగిరి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో అడిగిన వారందరికీ పనులు కల్పించాలని ఏపీఓ శేషిరెడ్డి సిబ్బందిని ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. చాలా గ్రామాల్లో పనులు కల్పించడం లేదని, అన్ని గ్రామాల్లో పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండల వ్యాప్తంగా రోజుకు కూలీలు మూడు వేలకు మించడం లేదని, కూలీల సంఖ్య పెంచాలని సూచించారు. ఆయా గ్రామాల్లోని ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్‌లు కూలీలు పనులకు వచ్చేలా చూడాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ ఈసీ చెన్న కేశవులు, సిబ్బంది పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగుపై అవగాహన కల్పించాలి

ఆలూరు: రైతులకు పండ్ల తోటల సాగుపై ఉపాధి హామీ సిబ్బంది అవగాహన కల్పించాలని జిల్లా ప్లాంటేషన్ మేనేజర్ నందకుమార్ ఆదేశించారు. స్థానిక సీఎల్‌ఆర్సీ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన ఏపీఓ, టీసీ, ఈసీ, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులతో ఏపీడీ పద్మావతి ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. నందకుమార్ మాట్లాడుతూ.. ప్రతి మండలానికి 300 ఎకరాలలో 17 రకాలుగా పండ్ల తోటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందిస్తుందని, రైతులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ముందుగా బోరు బావుల రైతులకు ఎంపిక చేసుకోవాలన్నారు.

కోలుకోలేక రైతు మృతి



హరీష్‌చంద్ర (ఫైల్)

దేవనకొండ: పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మండలంలోని జిల్లెడబుడకల గ్రామానికి చెందిన రైతు కొండమీది హరీష్‌చంద్ర కోలుకోలేక మృతి చెందాడు. హరీష్‌చంద్ర తనకున్న 5 ఎకరాలతో పాటు మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వ్యవసాయం నిమిత్తం దాదాపు రూ.12 లక్షలు దాకా అప్పు చేశాడు. ఆ అప్పు ఎలా తీర్చాలో తెలియక ఆదివారం పొలంలో పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో ఉండగా.. కుటుంబ సభ్యులు వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం ఉదయం మరణించాడు. మృతుడికి భార్య సుజాత, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు దేవనకొండ పోలీసులు తెలిపారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్



కొత్త విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేసిన దృశ్యం

హొళగుంద: హొళగుంద బస్టాండు నుంచి కోటవీధికెళ్లే రోడ్డులో ప్రమాదకరంగ ఉన్న విద్యుత్ తీగల సమస్యను బుధవారం ఆ శాఖాధికారులు పరిష్కరించారు. ఈ మార్గంలో నిత్యం దుకాణాలకు సరుకులు అన్‌లోడ్ చేసేందుకు, పెళ్లి, ఇతర ఊరేగింపులకు లారీలు, ఇతర వాహనాలు తిరుగుతుంటాయి. అయితే ఆ మార్గంలో దుకాణాలకు తీసుకున్న సర్వీస్ వైర్లు కిందకు వేలాడుతుండడంతో అటు తిరిగే వాహనాలు ముందుకు దాటాలంటే కర్రలతో తీగలను పైకెత్తుకుని వెళ్లో ఉండేది. ఈ సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశాలుండేవి. దీనిపై ఈ నెల 27న సాక్షి దిన పత్రికలో 'ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు' అనే కథనం ప్రచురితమైంది. ఈ సమస్యను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫీవుల్లా కూడా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన విద్యుత్ శాఖాధికారులు బుధవారం సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ట్రాన్స్ కో ఏఈ ఓబులమ్మ ఆ మార్గంలో వైర్లు ఎత్తులో ఉండేందుకు బస్టాండులో రెండు పెద్దసైజు విద్యుత్ స్తాంభాలను ఏర్పాటు చేశారు.

నేటి నుంచి భక్త యోగాంజనేయస్వామి ఉత్సవాలు

దేవనకొండ: మండలంలోని పి.కోటకొండ గ్రామంలో కొలువైన శ్రీ భక్త యోగాంజనేయ స్వామి ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ వ్యవస్థాపకులు యోగేశ్వర రావు బుధవారం విలేకరులకు తెలిపారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఆలయంలో కలశ స్థాపన, హోమాలు, జపములు, తీర్థ ప్రసాదాలు, జూన్ 1వ తేదీన రథోత్సవ కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

1 నుంచి అండర్–19 కబడ్డీ పోటీలు

భక్త యోగాంజనేయస్వామి ఉత్సవాల్లో భాగంగా ఓపెన్ టూ ఆల్ అండర్–19 కబడ్డీ పోటీలు జూన్ 1వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్లు దస్తగిరిగౌడ్, దేవేంద్రగౌడ్, హరికృష్ణ తెలిపారు. పోటీల్లో పాల్గొనే జట్లు ఈనెల 31వ తేదీలోపు ప్రవేశ రుసుం రూ.400 చెల్లించాలన్నారు. విజేతలకు మొదటి, రెండవ, మూడవ, నాలుగవ బహుమతులు వరుసగా రూ.12 వేలు, రూ.7 వేలు, రూ.3,500, రూ.2 వేలు చొప్పున అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్న జట్లు 7671865023, 9959093866 నంబర్‌లను సంప్రదించాలన్నారు.

తప్పుల తడకగా సీనియారిటీ జాబితా

ఆదోని సెంట్రల్: ఉమ్మడి కర్నూలు జిల్లా విద్యాశాఖ అధికారులు విడుదల చేసిన మున్సిపల్ ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా తప్పుల తడకగా ఉందని ఏపీ పురపాలక ఉపాధ్యాయుల సామాఖ్య ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.ఆర్.గోపాల్‌రెడ్డి, వి.సురేష్‌కుమార్ అన్నారు. వారు బుధవారం స్థానిక కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ.. ఆదోని, నంద్యాల పురపాలక సంఘం పరిధిలోని మున్సిపల్ ఉపాధ్యాయులకు సంబంధించి దాదాపు వంద మంది వివరాలు తప్పుగా ఉన్నాయన్నారు. అపాయింట్‌మెంట్ తేదీలు తప్పుగా ఉండడం, పాఠశాల సహాయకులుగా పదోన్నతులు పొందిన వారి పేర్లు ఇప్పటికీ జాబితాలో ఉండడం, కొందరు ఉపాధ్యాయుల పేర్లు అసలు లేకపోవడం, ఉపాధ్యాయుల కేటగిరీ, విద్యార్హతలు, పనిచేస్తున్న పాఠశాల పేరు తప్పుగా ఉండడం, మున్సిపల్ యాజమాన్యంలోకి వచ్చిన ఎయిడెడ్ ఉపాధ్యాయుల సీనియారిటీ ఇలా అనేక లోపాలు ఉన్నాయని ఆరోపించారు. దీనిపై జిల్లా విద్యాశాఖ అధికారులు మండల అధికారులకు తగిన సూచనలు ఇవ్వాలని, గతంలో మున్సిపల్ ఉపాధ్యాయులందరూ తమ సర్వీస్ రిజిస్టర్ తీసుకొని జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి రావడం జరిగిందని, ఇప్పుడు కూడా తమ అభ్యంతరాలను వ్యక్తం చేయడానికి మున్సిపల్ ఉపాధ్యాయులను జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి రావాలంటూ అసౌకర్యానికి గురి చేస్తున్నారని వాపోయారు. తప్పుల తడకగా ఉన్న మున్సిపల్ ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను సరిచేసి పక్కా వివరాలతో సక్రమమైన జాబితా రూపొందించాలని డిమాండ్ చేశారు.

ముందస్తు అడ్మిషన్లను అరికట్టాలి

దేవనకొండ: జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ముందస్తు అక్రమ అడ్మిషన్లను అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.శరత్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఐఎస్ఎఫ్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం కాక ముందే అడ్మిషన్లు నిర్వ హిస్తున్నారన్నారు. భాస్క ర్, సురేంద్ర పాల్గొన్నారు.